క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

చింతలమానెపల్లి: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 29న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కోట ప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. గౌరవ సభ్యులు, అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

గ్రామ దేవతలకు పూజలు



ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి గ్రామంలో సోమవారం గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. గ్రామ దేవత లక్ష్మిదేవర, ఇతర దేవతలను గ్రామంలోని వీధుల్లో ఊరేగించారు. గ్రామ సంప్రదాయాలతో పూజలు నిర్వహించి మొక్కుకున్నారు. గ్రామంలో పాడి పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నట్లు పూజారి నాయిని భీమయ్య తెలిపారు.

నేడు శివమందిరంలో సంకీర్తన

కెరమెరి: మండల కేంద్రంలోని శివాలయంలో నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీ హరిభక్త పరాయణ్ బాలాజీ మహరాజ్ కేంద్రె సంకీర్తన కార్యక్రమం ఉంటుందని శివమందిర్ సంస్థాన్ అధ్యక్ష, కార్యదర్శులు కేంద్రె జగన్, గిత్తే గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు మాతృ, పితృ పూజా కార్యక్రమం ఉంటుందని, భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌రూరల్: విద్యుత్‌లైనులో మరమ్మతులు, స్తంభాలకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలు కొట్టివేస్తున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ కమలాకర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓల్డ్‌కాలనీ, ఈఎస్‌ఐ, వెంకటరమణ థియేటర్, వసుంధర డొనల్, టీచర్స్ కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో టౌన్ -2 -11కేవీ లైన్‌లో పీఎంఐ ప్రీమాన్సూన్ ఇన్స్పెక్షన్ కార్యక్రమం ఉన్నందున నేడు జన్కాపూర్, కోర్టు రోడ్డు, ఫారెస్ట్ కార్యాలయం, ఎన్‌జీవో కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ విద్యుత్ శాఖ అధికారి సదాశివ్ ఒక ప్రకటనలో తెలిపారు.

నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: ఇంటర్మీడియెట్ బోర్డు పర్యవేక్షణ లోపం వల్ల పలువురు బాగా చదివే విద్యార్థులకు తక్కువ మార్కులు వచ్చాయని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు వసాకె సాయికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఓ విద్యార్థికి లాంగ్వేజ్ సబ్జెక్టులో మొదట 21 మార్కులు వచ్చి, రీవెరిఫికేషన్‌లో 91 మార్కులు వచ్చాయన్నారు. విద్యార్థులకు ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా రీవెరిఫికేషన్ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు సిరికొండ సతీశ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ విశ్వనాథం అన్నారు. సోమవారం బ్యాంకులో బీమా తీసుకొని చనిపోయిన వ్యక్తి కుటుంబసభ్యులకు బీమా పరిహారం కింద రూ.2 లక్షల చెక్కు అందజేశారు. జిల్లా కేంద్రంలోని కాసబ్‌వాడీ కాలనీకి చెందిన ఖైరిమా బేగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా భర్త సహిద్‌కు బీమా పరిహారం చెక్కును అందజేశామన్నారు. రైతులు పీఎంఎస్‌వై, పీఎంజేజేబీవై పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు సిబ్బంది సంధ్యారాణి పాల్గొన్నారు.

ఉపాధిహామీ.. సామాజిక తనిఖీ

- ముమ్మరంగా పనుల కొలతలు
- 492 పనులు.. రూ.7.86 కోట్ల ఖర్చు
- 8002 జాబ్ కార్డులు, 13,974 మంది కూలీలు
- నేడు 10 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు



కెలిబిలో కందకాల కొలతలు తీస్తున్న తనిఖీ బృందం సభ్యులు

కెరమెరి: మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో కొనసాగిన ఉపాధిహామీ పథకం పనులకు ముమ్మరంగా సామాజిక తనిఖీలు కొనసాగుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపాధి సిబ్బందితో పాటు సామాజిక తనిఖీ బృందం సభ్యులు చేసిన పనులకు కొలతలు తీసుకుంటున్నారు. ఓ వైపు సుర్రుమంటున్న భానుడు.. మరోవైపు ప్రజావేదిక సమయం దగ్గరపడుతుండడంతో కొలతలు తీసే పనులను వేగవంతం చేశారు. ఇప్పటికే 11 గ్రామపంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించగా, నేడు మరో పది, 31న పది గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు.

రూ.7.86 కోట్లు..

1, ఏప్రిల్, 2023 నుంచి 31, మార్చి, 2024 వరకు వివిధ రకాల 492 పనులు చేపట్టారు. దీనికి మెటీరియల్‌తో పాటు కూలీలకు వేతనాలు రూ.7,86,68,046లు అందజేశారు. మండలంలో మొత్తం జాబ్‌కార్డులు 9981 ఉండగా.. 18,399 మంది కూలీలు ఉన్నారు. అందులో యాక్టివ్ జాబ్ కార్డులు 8,002 ఉండగా.. 13,974 మంది కూలీలు యాక్టివ్‌గా ఉన్నారు. ప్రతీ రోజు సరైన విధంగా పని చేస్తే కూలీకి రూ. 272 ప్రభుత్వం చెల్లిస్తుండగా, రోజు కూలీ సరాసరి రూ. 220 వరకు సంపాదిస్తున్నారు. కాగా వంద రోజులు పూర్తి చేసిన కూలీలు 300 మంది మాత్రమే ఉన్నారు. సామాజిక తనిఖీ బృందంలో ఎస్ఆర్‌పీ ఒక్కరు ఉండగా.. డీఆర్‌పీలు 12, వీఎస్ఏలు 24 మంది ఉన్నారు.



సుర్దాపూర్‌లో ఉపాధిహామీ గ్రామసభ

కొనసాగిన పనులు..

గత ఆర్థిక సంవత్సరంలో చిన్న ఊటకుంటలు, మళ్లింపు కుంటలు, ఫార్మేషన్ రోడ్లు, కంటూరి కందకాలు, ప్లాంటేషన్ పనులు, నర్సరీలు, నీటి నిల్వ ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, మామిడి మొక్కల పెంపకం, గొర్రెల షెడ్లు, రోడ్డుకు ఇరువైపుల మొక్కలు తదితర పనులు మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో కొనసాగాయి. అయితే గతేడాది వరకు రెండేళ్లకోసారి నిర్వహించే ఉపాధి సామాజిక తనిఖీలు ఈ ఏడాది నుంచి సంవత్సరానికి ఒకసారి తనిఖీలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరో రెండేళ్ల తర్వాత ఆరు మాసాలకు ఒకసారి చేపడుతారని చెబుతున్నారు. వానలు వచ్చి పోయాక కొలతల్లో వ్యత్యాసాలు వస్తున్నాయని భావించి ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు వేగంగా తనిఖీలు చేపడుతున్నారు.

క్షేత్రస్థాయిలో పనుల కొలతలు



సామాజిక బృందం సభ్యులు ఉపాధిహామీలో జరిగిన పనులపై క్షేత్రస్థాయిలో కొలతలు తీసుకుంటున్నారు. పనులు చేసిన చోటికి వెళ్లి పనులను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే 11 పంచాయతీల్లో చేసిన పనుల గ్రామసభలు నిర్వహించాం. ఈనెల 31వ తేదీ వరకు మిగిలిన 20 గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తాం.

– మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో

పూలే దంపతుల విగ్రహావిష్కరణ



విగ్రహాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

వాంకిడి: మండలంలోని తేజిగూడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ వేడుకలను మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభివృద్ధి చదువుతోనే సాధ్యపడుతుందని గుర్తించిన గొప్ప సంఘ సేవకులు పూలే దంపతులని కొనియాడారు. మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, మండల అధ్యక్షుడు వడై బాబురావు, నాయకులు గుర్నులె మెంగాజీ, తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి త్యాగాలు మరువలేనివి



చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో సోమవారం బౌద్ధ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ సతీమణి మాతా రమాబాయి 89వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, రమాబాయి చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. బౌద్ధాచారం ప్రకారం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బీఎస్‌ఐ మండల అధ్యక్షుడు జైరాం మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్వేషణలో రమాబాయి సహకారం, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు విజయ్, దుర్గం శ్యాంరావు, దుర్గం సునీల్ కుమార్, విలాస్, రోషన్, శ్రీనివాస్, ప్రతాప్, టేమాజీ తదితరులు పాల్గొన్నారు.

'కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి'

ఆదిలాబాద్: ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని విలీన కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కేఆర్కే కాలనీలో ఆయన పర్యటిస్తూ కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని కాలనీల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. కేఆర్కే కాలనీలోని నీటి సమస్యను పరిష్కరించేలా మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడారు. అనంతరం బస్తీ దవాఖానాలు పరిశీలించిన ఆయన దవాఖానాలు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించి సిబ్బంది పనితీరును సమీక్షించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చిక్కాల దత్తు, సాయి, రాము, రేఖ, ముకుంద్, గంగుబాయి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలిస్తున్న అంజద్‌పాషా



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నర్సరీల్లో చేపట్టిన మొక్కల పెంపకంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో సురేశ్‌బాబు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నజ్రూల్‌నగర్‌లో శ్మశానవాటిక, సెగ్రిగేషన్ షెడ్డు, నర్సరీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, కారోబార్ చైన్‌రావు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: నర్సరీల్లో సస్యరక్షణ చర్యలు తీసుకొని మొక్కలు పెంచాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని రణవెల్లి, బూరెపల్లి, కోర్సిని, గంగాపూర్ గ్రామ పంచాయతీలలో పర్యటించారు. సెగ్రిగేషన్ షెడ్లు, నర్సరీలు, పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు పరిశీలించి చేపట్టాల్సిన పనులపై సిబ్బందికి ఎంపీడీవో పలు సూచనలు చేశారు. మొక్కలను రక్షించడానికి నీరు పట్టాలని, పొడి చెత్త, తడి చెత్తను వేరు చేసి కంపోస్టు ఎరువు తయారీ చేయాలన్నారు. వైకుంఠ ధామం పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు ఏపీవో గోవర్ధన్ సింగ్, ఆయా పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

కెరమెరి: క్రీడా ప్రాంగణాలను సద్వినియోగం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అంజద్ పాషా అన్నారు. సోమవారం మండలంలోని పరంధోళి, తుమ్మగూడ, అనార్‌పల్లి, దేవాపూర్, కెస్లాగూడ గ్రామ పంచాయతీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్రిమిటోరియల్, శ్మశాన వాటికలు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, క్రీడాప్రాంగణాలను పరిశీలించారు. గతంలో క్రీడా కిట్లు ఇచ్చినప్పటికీ క్రీడలు ఆడడం లేదని వాటిని సద్వినియోగం చేయాలన్నారు. నర్సరీల మొక్కలను చనిపోకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



పెంచికల్‌పేట్: మాట్లాడుతున్న ఏఈవో



లింగాపూర్: అవగాహన కల్పిస్తున్న ఏఈవో ఖలీల్

కెరమెరి: గ్రామాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఏఈవో వెంకటేశ్ అన్నారు. సోమవారం మండలంలోని బారేమోడి గ్రామంలో రైతు చైతన్య సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తక్కువ, ఎక్కువ ధరలకు విత్తనాలు అమ్మితే వెంటనే తెలపాలన్నారు. నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని, వ్యవసాయాధికారులు సూచించిన విత్తనాలను వినియోగించాలన్నారు.

పెంచికల్‌పేట్: నకిలీ విత్తనాలను రైతులు కొనుగోలు చేయవద్దని చేడ్వాయి ఏఈవో గౌసియా బేగం అన్నారు. మండలంలోని చేడ్వాయి, దరోగపల్లి గ్రామాల్లో సోమవారం రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమార్కులు గ్రామాల్లో రైతులకు నకిలీ విత్తనాలను అంటగడుతున్నారన్నారు. రైతులు లైసెన్సు దుకాణాల నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ప్రతీ కొనుగోలుకు రశీదులను తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలను విక్రయిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు.

లింగాపూర్: లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని ఏఈవో ఖలీల్ అన్నారు. సోమవారం మండలంలోని పిట్టగూడ గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మాజీ సర్పంచ్ దస్రు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జైనూర్: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సందీప్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విత్తన, ఎరువుల డీలర్లతో, వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విత్తన, ఎరువుల డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించొద్దన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లు ఎవరి దృష్టికొచ్చినా పోలీసులకు, వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. విత్తన, ఎరువుల దుకాణదారుల డీలర్లు, ఏడీఏ వెంకటి, అధికారులు తదితరులు ఉన్నారు.

కౌటాల: రైతులు నాణ్యమైన పత్తి విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని ఏఈవో చౌదరి అంజన్న అన్నారు. సోమవారం మండలంలోని గుండాయిపేట గ్రామంలో పత్తి విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ లైసెన్స్ ఉన్న ఫర్టిలైజర్ షాపుల్లోనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన, కొనుగోలు చేసిన అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారన్నారు.



కెరమెరి: మాట్లాడుతున్న ఏఈవో వెంకటేశ్



కౌటాల: మాట్లాడుతున్న ఏఈవో అంజన్న

ప్రధాన రహదారిపై పట్టింపేది..?

- గుంతలమయంగా జీటీరోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గుంతలతో అధ్వానంగా జీటీరోడ్డు

తిర్యాణి: మండలం నుంచి అటు జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌కు, ఇటు మంచిర్యాల జిల్లాకు వెళ్లాలంటే తిర్యాణి –త్రీ ఇన్‌క్లైయిన్ రోడ్డు ప్రధానమైనది. ఈ రోడ్డు గుండా నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఈ రోడ్డు గుంతలతో అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని చిన్న అరటిపెల్లి స్టేజి నుంచి తాండూర్ మండలంలోని త్రీ ఇన్‌క్లెయిన్ వైపు వెళ్లే దారి గుంతలమయంగా మారడంతో 'సాక్షి' పలుమార్లు కథనాలు ప్రచురించింది. దీంతో గత రెండు నెలల క్రితం అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. ఇక రోడ్డు సమస్యకు చెక్ పడినట్లే అని మండలవాసులు భావించారు. కానీ నిధులు సరిపోలేదనే సాకుతో దాదాపు 7 కిలోమీటర్ల మేర గుంతలు ఉంటే కేవలం రెండు కిలోమీటర్ల వరకు మాత్రమే గుంతలు పూడ్చి చేతులు దులుపుకున్నారు. దీంతో ఈ గుంతల రహదారిపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తుందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు.

అడుగడుగునా గుంతలు..

మండలంలోని మొర్రిగూడ స్టేజీ నుంచి మొదలుకొని అరటిపెల్లి స్టేజీ వరకు రోడ్డుపై అడుగడుగున పెద్ద గుంతలు ఏర్పడటంతో మరమ్మతుల కోసం రెండు కిలోమీటర్ల మేర గుంతలు ఏర్పడిన చోట రోడ్డు తొలగించి ప్యాచ్ పనులు చేపట్టారు. కనీసం రోడ్డు తొలగించిన వరకైన ప్యాచ్ పనులు చేపట్టకపోవడంతో మొత్తానికి రోడ్డు లేని పరిస్థితికి వచ్చింది. మండల కేంద్రం నుంచి వందలాది మంది ప్రజలు నిత్యం ఉద్యోగాలు, నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం మంచిర్యాల జిల్లాకు వెళ్తుంటారు. రహదారి ప్రయాణికులకు అనుకూలంగా లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుంతల రోడ్లపై నిత్యం ప్రయాణాలు సాగించడం ద్వారా డిస్క్ (వెన్నుపూస, నడుంనొప్పి) వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలి



చిన్న అరటిపెల్లి స్టేజి నుంచి త్రీ ఇన్‌క్లైయిన్ వెళ్లే దారి మొత్తం గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు చాలా ఇబ్బంది అవుతుంది. గత రెండు నెలల క్రితం ప్యాచ్ పనులు చేపట్టినా పూర్తిస్థాయిలో గుంతలు పూడ్చలేదు. కొన్నిచోట్ల రోడ్డు తొలగించి ప్యాచ్ పనులు చేపట్టకుండానే వదిలేశారు.

– దుర్శెట్టి సతీశ్, నాయకపుగూడ, తిర్యాణి

ఎవరూ పట్టించుకోవడం లేదు



రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు ఏమాత్రం అనుకూలంగా లేదు. ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు. గత రెండు నెలల క్రితం తూతూ మంత్రంగా రెండు కిలోమీటర్ల మేర ప్యాచ్ పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. పది రోజుల్లో పనులను ప్రారంభించకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం. – తోడసం భాస్కర్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు, తిర్యాణి

రేపు మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ రాక

కాగజ్‌నగర్‌రూరల్: మాదిగ సంఘాల మహాకూటమి తెలంగాణ రాష్ట్ర చైర్మన్ పోకల కిరణ్ ఈనెల 29న కాగజ్‌నగర్ పట్టణానికి రానున్నారని మాదిగ సంఘాల మహాకూటమి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఇరిగిరాల భాస్కర్ తెలిపారు. మాదిగ సంఘాల నాయకులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గొడిసెల రవి, బొమ్మెన శ్రీనివాస్, శ్రీమాన్, దేవన్న, నరేశ్, సురేశ్, కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలి



వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ అంజయ్య

జైనూర్: వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సీఐ అంజయ్య అన్నారు. ఆదివారం వాహనాల ధ్రువపత్రాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్ధ రాత్రి వాహనదారులు అనవసరంగా రోడ్లపై తిరగరాదన్నారు. మెడికల్ పనులకు తప్ప రాత్రి వేళల్లో బయటకు రావొద్దన్నారు. ప్రతీ వాహనదారులు సరైన ధ్రువపత్రాలతో పాటు లైసెన్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 6 ద్విచక్రవాహనాలను సీజ్ చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ అంజయ్య, ఎస్సైలు సందీప్‌కుమార్, మాధవ్‌లు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న రావి శ్రీనివాస్

బెజ్జూర్: వివిధ కారణాలతో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను సోమవారం సిర్పూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన సీతారాం, సలుగుపల్లి గ్రామానికి చెందిన ఆత్రం నందారం తల్లి మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు బుస శంకర్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, నాయకులు నరేందర్ గౌడ్, మహేశ్, జావిద్, నహీర్, సతీశ్, హకీం ఉన్నారు.